క్లుప్తంగా

మాల మహానాడు పట్టణ అధ్యక్షుడి ఎంపిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింహులు

కొడంగల్ రూరల్: తెలంగాణ మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బ్యాగరి నర్సింహులు ఎంపికయ్యారని సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నరసింహయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేశం నర్సింహులుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడారు. మాలల హక్కుల కోసం, అభ్యున్నతికి పోరాటం చేస్తానని చెప్పారు. ఇందులో బాలరాజ్, బస్వరాజ్, వెంకటేశ్, నరేష్, మహేష్‌కుమార్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

గురునాథ్‌రెడ్డికి సన్మానం



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ కోస్గి మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడిగా కొనసాగారని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, నాయకులు విజయకుమార్, కిష్టప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, సీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అడిగితే అరెస్టులా?



పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తదితరులు

బొంరాస్‌పేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కోసం పోరాడుతున్న ప్రజాసంఘాల నాయకులను ఎమ్మెల్యే అరెస్టు చేయిస్తున్నారని లంబాడి హక్కుల పోరాట సమితీ (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలం నుంచి యేటా 12వందల మంది విద్యార్థులు ఇతర మండలాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతుండగా, మరి కొందరు పై చదువులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో కేఎస్‌పీఎస్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితీ నాయకులున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

వికారాబాద్ అర్బన్: విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సూచించారు. గురువారం పట్టణంలోని యునైటెడ్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజంపై అవగాహన పెంచుకుంటూ రాజకీయాల్లో రాణించేందుకు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగుకాల్వ నిర్మాణ పనులు షురూ



మురుగు కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ తదితరులు

బొంరాస్‌పేట: మండలంలోని తుంకిమెట్ల గ్రామ పంచాయతీ మాలెకాడిబావిపల్లెలో గురువారం మురుగుకాల్వ నిర్మాణం ప్రారంభించారు. రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనులను ఎంపీటీసీ సభ్యుడు తిరుపతయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య పరిశీలించారు. పల్లెల్లో మురుగుకాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి అనారోగ్యాలకు గురౌతున్నట్లు ప్రజలు తెలిపారు. సమస్య తీరడంతో హర్షం వ్యక్తంచేశారు. వార్డు సభ్యురాలు అనంతమ్మ ఉన్నారు.



కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



పరిగి: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి రాఖీ సోదరి అర్చనరెడ్డి



వికారాబాద్‌లో ఎమ్మెల్యే ఆనంద్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



ముస్లింలకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

అనురాగ‘బంధం’

అన్నా చెల్లెళ్ల అనురాగ బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ఆడబిడ్డలు ఘనంగా జరుపుకొన్నారు. నువ్వు నాకు.. నీకు నేను రక్ష అంటూ తోబుట్టువులకు రాఖీ కట్టి ఆశీర్వదించగా.. ఉన్నంత కాలం కలకాలం తోడునీడగా ఉంటాను సోదరీ అంటూ సోదరులు కట్నకానుకలు సమర్పించి పాదాభివందనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ కౌన్సిలర్ సాహుశ్రీలత



తాండూరు: శుభప్రద్‌పటేల్‌కు రాఖీకడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌కు రాఖీ కట్టిన ఆయన సోదరీమణులు



కొడంగల్ రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి రాఖీలను కట్టిన మహిళలు



బట్వారంలో..



ఎమ్మెల్యే ఆనంద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు మధు అక్కయ్య



దోమ: ఖమ్మంనాచారంలో అన్నకు రాఖీ కడుతున్న సర్పంచ్ వెంకటమ్మ



మర్పల్లి: పంచలింగాలలో.. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డికి రాఖీ కట్టుతున్న చెల్లెలు



కొడంగల్ చెల్లెలి పాదాలకు మొక్కుతున్న అన్న



పెద్దేముల్: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



యాలాలలో..



మోమిన్‌పేట: సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీ



బషీరాబాద్‌లో..

రేపు ఉత్సవ నూతన కమిటీ ఏర్పాటు

తాండూరు: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి నూతన కమిటీని శనివారం ఉదయం 11 గంటలకు ఎన్నుకుంటామని సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, కమిటీ ప్రతినిధి పూజారి పాండులు తెలిపారు. త్వరలో జరిగే గణేశ్ ఉత్సవాలకు నూతన కమిటీ ఎన్నిక పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశానికి పట్టణంలోని ఉత్సవ కమిటీ నిర్వాహకులు, హిందువులు హాజరు కావాలని కోరారు.

రాఖీ అంటే రక్ష

కుల్కచర్ల: రాఖీ అనేది కేవలం సోదర సోదరీమణులకు సంబంధించినది మాత్రమే కాదని, రాఖీ అంటే రక్షా అని ఆర్‌ఎస్‌ఎస్ సహ విభాగ్ ప్రచారక్ రాజేందర్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం అంగడిబజార్‌లోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఖీ అనేది మన దేశ అనుబంధాన్ని తెలిపితే ఒక్క గొప్ప అంశమన్నారు. నేను నీకు రక్షా.. నీవు నాకు రక్షా మనమందరం దేశానికి రక్ష అనే సిద్దాంతంతో జాతీయభావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రకాష్ రెడ్డి, రాజేశ్వర్, రమేష్, శ్రీనివాస్, ఎల్లయ్య, శివసంతోష్, రవి, చందు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు దళితబంధు

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం వికారాబాద్ నియోజకవర్గంలో పక్కదారి పడుతుందని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. పథకాన్ని ఎమ్మెల్యే తన అనుచరులకు మాత్రమే ఇస్తున్నారని, అసలైన లబ్ధిదారులకు ఇవ్వడం లేదని విమర్శించారు. కనీసం పార్టీలో ఉన్న సీనియర్ దళిత నాయకుల అభిప్రాయం కూడా తీసుకోవడం లేదని పేర్కొన్నారు. అనర్హులను ఎంపిక చేసి, పథకాన్ని నీరు గారుస్తున్నారని, పార్టీ అధిష్టానం దృష్టి సారించి, అర్హులకు అందేలా చూడాలని కోరారు.

విడతల వారీగా సీసీరోడ్లు

మర్పల్లి: విడతల వారీగా గ్రామంలో అంతర్గత సీసీరోడ్లను నిర్మిస్తామని బూచన్‌పల్లి సర్పంచ్ జయ అన్నారు. బుధవారం గ్రామంలోని మల్లకార్జున దేవాలయం కాలనీలో ఎస్‌డీఎఫ్ రూ.4 లక్షలతో సీసీ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, కొన్ని వార్డుల్లో సీసీ రోడ్లు అవసరం ఉన్నందున ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి త్వరలోనే నిర్మాణం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అందజేయాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొడంగల్: పట్టణంలోని కేశవనగర్‌లో వెలిసిన శ్రీ గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఆలయ అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 9.30 గంటలకు పంచామృతాభిషేకం, 10.30 గంటలకు అష్టోత్తర పారాయణం, 11 గంటలకు తులసి అర్చన, మధ్యాహ్నం ఒంటి గంటలకు హస్తోదకం మంగళహారతితో ప్రత్యేక పూజలు చేశారు. 42 ఏళ్లుగా స్వామి వారి ఆరాధనోత్సవాలు జరుగుతున్నాయని ఆలయ అర్చకుడు అక్కి శ్రీనివాసమూర్తి, టీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రథోత్సవం రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమాలు, శనివారం రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గిరిజనబంధు అమలు చేయాలి

తాండూరు: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలతో గిరిజనబంధు పథకం అమలు చేయాలని గోర్‌శిక్వాడి, గోర్‌సేన తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌రాథోడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బీసీబంధు, ఎస్సీలకు దళితబంధు పథకాల ద్వారా ఆర్థికసహాయం అందజేస్తోందని, గిరిజనులు వెనుకబడి ఉన్నారని, వారికీ గిరిజనబంధుతో పాటు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సర్దార్‌నగర్ సర్పంచ్ మునగపాటి స్వరూప పేర్కొన్నారు. గురువారం హనుమాన్ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ స్వామి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ నర్సింహులు, సంఘం సభ్యులు శివకుమార్, పాండు, వెంకటయ్య, సత్తయ్య, సుదర్శన్, అనిల్, అశోక్, రమేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

వైభవంగా ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు

తాండూరు: తాండూరు పట్టణంలో ముర్షద్ దర్గ ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అబ్దుల్ ఘని పాష నివాసం నుంచి గంధంను ఊరేగింపుగా దర్గకు తీసుకొచ్చారు. అనంతరం సందల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్‌తో పాటు పలువురు నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న శుభప్రద్‌పటేల్

ఈ ఊర్లకు దార్లేవి?

- సైకిల్, అంబులెన్స్ వెళ్లని రహదారులు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- ఇబ్బందుల్లో బాధిత గ్రామాల ప్రజలు
- ప్రాణాపాయ స్థితిలో దేవుడే దిక్కు
- కాన్పుకోసం తీసుకెళ్లాలంటే కష్టమేనంటున్న వైనం



మహంతీపూర్ వాగులో వాహనంపై వెళ్తున్న గ్రామాధికారి(ఫైల్)

చంద్రమండలం మీద ఆవాసం ఏర్పాటుకు విస్తృత పరిశోధనలు చేస్తున్న రోజుల్లో.. భూమండల మీద ఇంకా రవాణ సౌకర్యం లేని పల్లెలు ఎన్నో ఉన్నాయి. అందుకు సాక్షాలు వర్షాలు పడిన ప్రతిసారి బయట పడుతూనే ఉన్నాయి. కనీసం రోడ్డు సౌకర్యాలు కరవై.. ప్రాణాపాయ స్థితిల్లో ఎన్నో ప్రణాలు గాలిలో కలిసి పోతున్న సంఘటనలు వెలుగు చూసిన ఘటనలు లేకపోలేదు. పాలకులు రహదారుల నిర్మాణానికి హామీలైతే ఇస్తున్నారు కానీ.. అవి వాస్తరూపం దాల్చడం కల్ల అని బాధిత గ్రామాలు వాపోతున్న వైనంపై ‘సాక్షి’ కథనం.

బొంరాస్‌పేట: పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు, పల్లె ప్రగతి అని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు చెప్పడమే తప్పా.. రవాణ సౌకర్యం లేక వెనుకబాటు తనానికి గురైన వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బొంరాస్‌పేట మండల పరిధి గ్రామాల్లో నేటికీ రోడ్డు సౌకర్యాలు సరిగా లేక పల్లె ప్రజలు రవాణ కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆదర్శ గ్రామాలు అంటూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ.. ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం లేదని బాధిత గ్రామాలు ప్రజలు ఆరోపిస్తున్నారు.

అనాగరిక స్థితిలో..

ప్రయాణ సౌకర్యం ఉన్న ఊళ్లు ప్రగతి బాటలో పయనిస్తాయని సామాజిక చైతన్య పరుల అభిప్రాయ పడుతున్నారు. నిజానికి రోడ్డు, ప్రయాణ సౌకర్యం లేని గ్రామాల జీవన విధానం మిగితా గ్రామాలతో పోలిస్తే అనాగరిక, అధ్వాన స్థితిలో ఉండడం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. అలా మసకబారిన గ్రామాలు, కుగ్రామాలు, గిరిజన తండాలు మండలంలో చాలానే ఉన్నట్లు తెలుస్తోంది.

అత్యవసరాల్లోనూ..

అత్యవసర సమయాల్లో రోడ్డు మార్గం సరిగా లేక తండాలు, గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సైకిల్ వెళ్లలేని అధ్వాన పరిస్థితిలో దారులు ఉండటంతో ప్రభుత్వం నుంచి వైద్య సేవలు అందించే 108, 104 అంబులెన్స్‌లు వెళ్లలేని దుస్థితి. దీంతో ప్రాణాపాయ స్థితిలో గర్భిణులు, ఇతర రోగుల ప్రాణాలకు దేవుడే దిక్కని స్థానికులు వాపోవటం గమనార్హం.



గిర్కబావితండాకు ఇలా వెళ్లాల్సిందే..

అనుసంధానం రోడ్లేవి?

మండలంలోని 5 గ్రామాలకు, 12తండాలకు రోడ్డు సౌకర్యం లేదు. దుప్‌చర్ల–మహంతీపూర్, ఎన్కెపల్లి–వడిచర్లకు, మెట్లకుంట–బురాన్‌పూర్, నాజ్‌ఖాన్‌పల్లి–రేగడిమైలారం మహంతీపూర్ గ్రామపంచాయతీతో పాటు బాపన్ చెర్వుతండా పరిధి గిర్కబాయితండా, బొక్కిఉమ్లాతండాలకు రోడ్డు సౌకర్యం లేదు. కొత్తూరు జీపీ పరిధి మెట్టుచెల్కతండాతో పాటు, అనుబంధ గ్రామాల పరిస్థితి అంతే..

అధికారుల వివక్ష

మరికొన్ని నివాస ప్రాంతాలకు ఖాళీనడక తప్ప ఎడ్లబండి కాదు కదా.. సైకిల్ దారి కూడా లేదని, తమ గ్రామాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు వివక్షత చూపుతున్నారని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గర్భిణులను కాన్పుకోసం తీసుకెళ్లాంటే చేతులపై మోసుకెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

దయనీయ స్థితి

మా తండాకు రోడ్డు సౌకర్యం లేదు. గర్భిణులను కాన్పు కోసం మంచం మీద కూడా తీసుకెళ్లలేని దుస్థితి. భుజాన ఎత్తుకొని పోవాల్సిన దయనీయ స్థితిలో ఉన్నాం. ఎడ్లబండి దారి లేదు. పాలకులు జరచూసి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ముత్యాలమ్మ, గిర్కబాయితండా

పాఠశాలకు వెళ్లాలంటే..

మా గ్రామంతో పాటు మహంతిపూర్ గ్రామం నుంచి ఏ ఊరికి వెళ్లాలన్నా చుట్టూ వాగులు ఉన్నాయి. అందుకే మా ఊర్లకు ఇతర గ్రామాల నుంచి రోడ్డు సౌకర్యం లేదు. వాగుల వరకు రోడ్డు సౌకర్యం కల్పించినా వాహన సౌకర్యం కలిగేది. కానీ ద్విచక్ర వాహనం కూడా రాని దుస్థితి.

– మొగులయ్య, జానకంపల్లి